అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 27 । డిసెంబర్ । 2024





సంధ్యా సమయంలో ఆకాశం రెండు రంగుల్లో కనువిందు చేసింది. తొలుత పసిడి వర్ణంలో, కాసేపటికి అరుణ వర్ణంలో ఆకర్షణీయంగా కనిపించింది. ఈ దృశ్యాలు పాడేరు ప్రాంతంలో ఆవిష్కరించాయి. – సాక్షి, పాడేరు

న్యూస్‌రీల్

జనవరి 31 నుంచి అరకు ఉత్సవాలు

- ఫిబ్రవరి 23 నుంచి మారేడుమిల్లి ఉత్సవాలు
- ఒకటి నుంచి అరకు, బొర్రా గుహల వద్ద ప్లాస్టిక్ నిషేధం అమలు
- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


సాక్షి, పాడేరు: వచ్చే ఏడాది జనవరి 31 నుంచి మూడు రోజుల పాటు అరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్, జిల్లా పర్యాటక మండలి చైర్మన్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. గురువారం కలెక్టర్ చాంబర్‌లో జరిగిన పర్యాటక అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అరకు ఉత్సవాలను జనవరి 31, ఫిబ్రవరి 1, 2, మారేడుమిల్లి ఉత్సవాలను అదేనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహిస్తామన్నారు.అదేవిధంగా అరకు, బొర్రాగుహల ప్రాంతాల్లో చిన్న సైజు నుంచి రెండు లీటర్ల వరకు గల ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లకు కూడా నిషేధించినట్టు తెలిపారు. ఆయా ప్రాంతాలను సందర్శించే పర్యాటకులు ప్లాస్టిక్‌కు బదులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రాంతాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, కొనడం, అమ్మడం లాంటి వ్యవహారాలపై నిషేధం ఉంటుందన్నారు. ఈ నిబంధనలు జనవరి ఒకటి నుంచి అమల్లోకి వస్తాయన్నారు. అరకు, మారేడుమిల్లి ఉత్సవాల నిర్వహణకు రూ.మూడేసి కోట్లు చొప్పున నిధులు మంజూరు చేయాల్సిందిగా ప్రభుత్వానికి నివేదికలు సమర్పించామన్నారు. జేసీ అభిషేక్‌గౌడ్, పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్వో పద్మలత, జిల్లా పర్యాటక అధికారి వి.దాసు పాల్గొన్నారు.

4,014 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

అడ్డతీగల: స్థానికి సబ్‌డివిజన్ పరిధిలోని నాలుగు మండలాల్లో రైతుల నుంచి 4,014 మెట్రిక్ టన్నులధాన్యం కొనుగోలు చేసినట్లు వ్యవసాయశాఖ ఏడీ కంకిపాటి సావిత్రి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ రాజవొమ్మంగి మండలంలో 2733, అడ్డతీగల మండలంలో 730, గంగ వరం మండలంలో 350, వై.రామవరం మండలంలో 201 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్టు ఆమె తెలిపారు.

జిల్లాలో ఏ ఇంటి తలుపు తట్టినా కరెంట్ షాక్ కొడుతోంది. కూటమి ప్రభుత్వం ట్రూఅప్, సర్దుబాటు చార్జీల పేరుతో జనంపై పెనుభారం మోపింది. నవంబర్ కన్నా డిసెంబర్‌లో విద్యుత్‌ను తక్కువగా వినియోగించినా బిల్లు మాత్రం ఎక్కువగా వచ్చిందని వినియోగదారులు వాపోతున్నారు. సీఎం చంద్రబాబు చెబుతున్న సంపద సృష్టి అంటే **ఇదేనేమా మరి అంటూ వారు విమర్శిస్తున్నారు.**

కూటమి బాదుడు



- ఎఫ్‌పీపీసీసీ పేరిట కూటమి సర్కారు దొంగ దెబ్బ
- బిల్లు కంటే అదనపు చార్జీల భారమే ఎక్కువ
- పాత బకాయిలు చెల్లించాలని గిరిజనులపై ఒత్తిడి
- విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజల్లో వెల్లువెత్తుతున్న నిరసన
- జనం బాధలకు మద్దతుగా నేడు వైఎస్సార్‌సీపీ పోరుబాట

ఉమ్మడి విశాఖ ప్రజలపై రూ.293 కోట్లు అదనపు భారం

సాక్షి,పాడేరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి విద్యుత్ వినియోగదారులకు బిల్లులు గుబులు పుట్టిస్తున్నాయి. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని చంద్రబాబుతో సహ కూటమి నేతలంతా ప్రకటించారు. అయితే ఈ రెండు నెలల వ్యవధిలో విద్యుత్ బిల్లులు పెరుగుతుండటంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తక్కువ ధరకు నాణ్యమైన విద్యుత్ సేవలు పొందిన వినియోగదారులు కూటమి ప్రభుత్వం చర్యలతో బెంబేలెత్తిపోతున్నారు. జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను అమలుజేసింది. అయితే పాత బకాయిల జోలికి గత ప్రభుత్వం పోలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మాత్రం పెండింగ్ బిల్లులు కట్టాలని తమపై ఒత్తిడి చేస్తోందని గిరిజనులు వాపోతున్నారు.

ఎంతో తేడా..: ఎస్సీ,ఎస్టీలను మినహాయిస్తే వివిధ వర్గాల ప్రజలు, వ్యాపారులు వినియోగించే విద్యుత్‌కు సంబంధించి డిసెంబర్‌లో బిల్లులు అధికంగానే వచ్చాయి. నవంబర్‌తో పోలిస్తే డిసెంబర్ నాటికి విద్యుత్ బిల్లుల్లో చాలా తేడా ఉంది. తక్కువ యూనిట్లు విద్యుత్‌ను వినియోగించిన **వారికి కూడా బిల్లులు అధికంగా రావడంపై వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. వినియోగించిన కరెంట్ చార్జీ కంటే అదనపు** చార్జీలు ఎక్కువగా ఉంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం రూ.150 నుంచి రూ.200 వరకు విద్యుత్ బిల్లులు పెరిగినట్టు వారు చెబుతున్నారు.

పోరుబాటకు తరలిరండి — వైఎస్సార్‌సీపీ పిలుపు

విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటానికి సిద్ధమైంది. ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని మూడు నియోజవర్గాల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ పోరుబాటకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యుత్ చార్జీలు తగ్గించాలనే డిమాండ్‌తో ర్యాలీలు, ధర్నాలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా నియోజకవర్గ కేంద్రమైన పాడేరులో పార్టీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో పార్టీ నాయకులంతా పాడేరులో ర్యాలీ నిర్వహించి విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తారు.

➡ నియోజకవర్గ కేంద్రమైన అరకు లోయలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో పాటు పార్టీ నాయకులంతా మెయిన్ రోడ్డులో ర్యాలీ నిర్వహించి విద్యుత్ పంపిణీ సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తారు.

సామాన్యుడిపై పెనుభారం

రంపచోడవరం: కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి సామాన్యుడిపై పెనుభారం మోపిందని ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (అనంతబాబు), మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం వారు మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపుపై పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల 27 శుక్రవారం రంపచోడవరం సబ్‌స్టేషన్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరు కావాలని వారు కోరారు.

65 యూనిట్లకు రూ.593
54 యూనిట్లకు రూ.712

రెండు నెలల బిల్లుల్లో ఎంతో వ్యత్యాసం



మండల కేంద్రం కూనవరంలో ఓ మం**దులు దుకాణా**నికి గత నవంబర్ నెలలో 65 **యూనిట్ల విద్యుత్** వినియోగానికి అన్ని **చార్జీలతో కలుపు**కుని రూ.593 బిల్లు వచ్చిం**ది.అయితే ఆదే** దుకాణానికి డిసెంబర్‌లో **మాత్రం 54 య**ూనిట్ల విద్యుత్ వినియోగానికి **రూ.712 బిల్లు** వచ్చింది. విద్యుత్ వినియోగం **తగ్గినప్పటికీ బిల్లు** అధికంగా రావడంతో **వినియోగదారుడి**పై ఆర్థికభారం పడింది.

ఉమ్మడి విశాఖ జిల్లాలో వినియోగదారుల వివరాలు

ఎల్‌టీ కేటగిరీ వినియోగదారులు

కేటగిరీ	కనెక్షన్లు	డిమాండ్ (రూ.కోట్లలో)	అదనపు భారం (రూ.కోట్లలో)
డొమెస్టిక్	1577984	877.56	80
వాణిజ్యం, ఇతరులు	177265	422.14	10
పరిశ్రమలు	4615	66.61	05
ఇనిస్టిట్యూషనల్	32114	81.59	10
వ్యవసాయం, అనుబంధం	50713	9.12	02
మొత్తం	1842691	1457.01	107

హెచ్‌టీ కేటగిరీ వినియోగదారులు

కేటగిరీ	కనెక్షన్లు	డిమాండ్ (రూ.కోట్లలో)	అదనపు భారం (రూ.కోట్లలో)
టౌన్‌షిప్, కాలనీలు	36	20.79	01
వాణిజ్యం, ఇతరులు	1094	537.91	50
పరిశ్రమలు	632	3076.27	100
ఇనిస్టిట్యూషనల్	89	267.00	35
వ్యవసాయం, అనుబంధం	07	1.53	0.20
మొత్తం	1858	3903.51	186.20
ఎల్‌టీ+హెచ్‌టీ	1844549	5360.52	293.20

రోడ్డు ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

- పొగమంచు నేపథ్యంలో మరింత జాగ్రత్త
- జిల్లా రవాణా అధికారి లీలా ప్రసాద్

పాడేరు : శీతాకాలంలో చలితో పాటు విపరీతమైన పొగమంచు కారణంగా ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నందున వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణాశాఖ అధికారి లీలాప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. వీలైనంత వరకు పొగమంచు ప్రభావం ఎక్కువగా ఉంటే ప్రయాణాలు కాస్త వాయిదా వేసుకోవాలని సూచించారు. తప్పనిసరిగా ప్రయాణించాల్సి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మార్గంలో వాహనదారులు ఎడమ వైపు మాత్రమే ప్రయాణించాలన్నారు. మార్గం కనిపించకపోతే కాస్త వేచి చూసి ప్రయాణం కొనసాగించాలన్నారు. పొగమంచు ఎక్కువగా ఉంటే వాహన వేగాన్ని తగ్గించి నడపాలన్నారు. లైట్లు ఆన్ చేసి ఉంచాలన్నారు. హెడ్‌లైట్లు మాత్రం తక్కువ బీంలోనే వెలిగించాలన్నారు. మలుపు తిరిగేటప్పుడు పది సెకెండ్ల ముందుగానే ఇండికేటర్ వేయాలని, విండిల్డ్, రియర్ మిర్రర్లను క్లీన్‌గా ఉంచుకోవాలని సూచించారు. ప్రయాణానికి సరిపడ సమాయాన్ని కేటాయించుకోవాలని సూచించారు. సడక్ బ్రేకులు వేయవద్దని, రోడ్డు మార్జిన్ గమనిస్తూ వాహనాలను నడపాలన్నారు. ఘాట్‌రోడ్డులో 40కేఎంపీహెచ్ వేగాన్ని మించి వాహనాలను నడపవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు. సీట్‌బెల్ట్ వేసుకోవాలన్నారు. వాహనాల రాంగ్ పార్కింగ్ చేయవద్దన్నారు. మత్తు పదార్థాలు సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడపవద్దని ఆయన సూచించారు.

మైనారిటీస్ ఫైనాన్స్ ఈడీగా షంసున్నీసా బేగం



జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను కలిసిన షంసున్నీసా బేగం

మహారాణిపేట (విశాఖ): ఆంధ్రప్రదేశ్ స్టేట్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ)గా డిప్యూటీ కలెక్టర్ షంసున్నీసా బేగం గురువారం బాధ్యతలు చేపట్టారు. పాతపోస్టాఫీసు వద్దనున్న ఉమ్మడి విశాఖ జిల్లా మైనారిటీస్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రస్తుత ఈడీ సత్యపద్మ నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించారు.

హైవే బాధితులకు వెంటనే నష్టపరిహారం



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, ఎమ్మెల్యేలు



సమావేశానికి హాజరైన పలుశాఖల అధికారులు, మండల పరిషత్ అధ్యక్షులు

- ఇంటింటికి కుళాయిల ద్వారా సురక్షిత తాగునీరు
- నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ
- దిశా చైర్‌పర్సన్, అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి ఆదేశం

సాక్షి,పాడేరు: జాతీయ రహదారి నిర్మాణంతో నష్టపోయిన లబ్ధిదారులకు వెంటనే నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశా) చైర్‌పర్సన్, అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో దిశా సమావేశాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలపై జిల్లాలో గ్రామగ్రామాన విస్తృత ప్రచారం చేసి అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీటిని పంపిణీ చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వద్దన్నారు. జిల్లాలో రూ.300 కోట్లతో 4,547 పనులు మంజూరయ్యాయని, వాటిలో రూ.143.84కోట్లతో 3,362 పనులు పూర్తి చేశారని, మిగిలిన 1185 పనులు ప్రగతిలో ఉన్నాయన్నారు. రిజర్వాయర్ల ద్వారా నీటి లభ్యతకు అనుకూలమైన ప్రాంతాలను, ఊటనీటిని సరఫరా చేసే ప్రాంతాలను గుర్తించి డీపీఆర్ తయారు చేయాలని ఆదేశించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా స్థానికులకు మోటార్ల మరమ్మతులపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. జిల్లాలో కిడ్నీ సమస్యలపై దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో 1172మంది సికిల్‌సెల్ ఎనీమియా బాధితులు ఉన్నారని, వీరిలో 960 మందికి మాత్రమే నెలకు రూ.10వేల పింఛన్ అందుతుందన్నారు. మిగిలిన బాధితులకు పింఛన్ ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్ కింద రూ.304 కోట్ల విలువగల పనులు పూర్తి చేయడంతో పాటు వందరోజుల పనిదినాల కల్పనలోను రాష్ట్రం మొదటి స్థానం సాధించడం శుభ పరిణామమన్నారు.

ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపరచాలి

- పాడేరు, అరకు ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం

ఏజెన్సీలో ఉద్యోగ,ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని అరకు,పాడేరు ఎమ్మెల్యేలు రేగం మత్స్యలింగం, మత్స్యరాస విశ్వేశ్వరరాజు కోరారు.అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో పేరుందని, ఈ మేరకు అరకు కాఫీ తయారీ పరిశ్రమను వెంటనే ఏర్పాటు చేసి గిరిజన అభ్యర్థులకు ఉద్యోగ,ఉపాధి కల్పించాలన్నారు. అన్ని గ్రామాలకు పెండింగ్ రహదారులు, గెడ్డలపై వంతెన నిర్మాణాలను పూర్తి చేయాలని కోరారు.ఈ సమావేశంలో కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు అభిషేక్, సింహాచలం, అపూర్వభరత్ పాల్గొన్నారు.

గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేయాలి

కొయ్యూరు: గంజాయి రవాణాకు పూర్తిస్థాయి లో అడ్డుకట్ట వేయాలని చింతపల్లి డీఎస్పీ షేక్ షహబాజ్ అహ్మద్ ఆదేశించారు. గురువారం ఆయన వార్షిక తనిఖీల్లో కొయ్యూరు, మంప స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా సీఐ వెంకటరమణ, కొయ్యూరు ఎస్ఐ కిషోర్ వర్మ, మంప ఎస్ఐ శంకర్‌తో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణాపై చర్చించారు. గంజాయి వల్ల కలిగే అనర్థాలను యువతకు తెలియజేయాలని డీఎస్పీ సూచించారు. స్టేషన్ ఆవరణను, రికార్డులను పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న పోలీసుస్టేషన్ భవనాన్ని పరిశీలించిన ఆయన పలు సూచనలు చేశారు.



నిర్మాణ దశలో ఉన్న స్టేషన్ భవనాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ షహబాజ్ అహ్మద్

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీకి అవమానం

- రెవెన్యూ సదస్సు వేదికపైకి ఆహ్వానించని అధికారులు
- ప్రొటోకాల్ ఉల్లంఘన తగదంటూ ఆ పార్టీ ప్రజాప్రతినిధుల ధ్వజం
- కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరిక



వేదికపైకి ఆహ్వానించకపోవడంతో ప్రజలతో కలిసి కూర్చున్న వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ముదిలి సుబ్బయమ్మ

పాడేరు : ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజలతో ఎన్నిక కాబడిన వైఎస్సార్‌సీపీకి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులను ప్రొటోకాల్ పాటించకుండా అధికారులు అవమాన పరుస్తున్నారు. కొంత మంది అధికారులు కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తూ.. ఏ పదవి లేని టీడీపీ, జనసేన నాయకులను మాత్రం వేదికపైకి పిలిచి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. పాడేరు మండలం ఇరడాపల్లి గ్రామ సచివాలయం వద్ద గురువారం తహసీల్దార్ త్రినాథరావు అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు ముదిలి సుబ్బయ్యమ్మను వేదికపైకి ఆహ్వానించాల్సి ఉంది. అలా చేయకపోవడం వల్ల ఆమె సభకు హాజరైన స్థానికులతో కలిసి కూర్చున్నారు. రెండు రోజుల క్రితం నిర్వహించిన పీసా కమిటీ ఎన్నికల్లో కూడా ఆమెకు అధికారులు కనీస సమాచారం ఇవ్వలేదు. గ్రామాల్లో ఏ ప్రభుత్వ కార్యక్రమాలు, సభలు, సమావేశాలు జరిగినా తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా అధికారులు అవమాన పరిచే విధంగా వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌ను ఫిర్యాదు చేస్తామని వారు వెల్లడించారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎంపీ తనూజరాణి, పాడేరు,అరకు ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, జేసీ తదితరులు

సోలార్ రూఫ్ టాప్ కరపత్రాల ఆవిష్కరణ

సాక్షి,పాడేరు: సోలార్ రూఫ్ టాప్‌కు సంబంధించిన కరపత్రాలను కలెక్టర్ దినేష్ కుమార్,అరకు ఎంపీ డాక్టర్ తనూజ రాణి, పాడేరు, అరకు ఎమ్మెల్యేలు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రేగం మత్స్యలింగం ఆవిష్కరించారు. సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లులు తగ్గించుకోవచ్చని, ఈమేరకు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో జేసీ అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవోలు,విద్యుత్ పంపిణీ సంస్థ అధికారులు పాల్గొన్నారు.

తక్షణమే విధుల్లోకి తీసుకోవాలి

- గ్రామ వలంటీర్ల డిమాండ్
- ఐటీడీఏల ఎదుట రిలే దీక్షలు
- ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం మరింత ఉధృతం



ముంచంగిపుట్టులో దీక్షలు చేపట్టిన వలంటీర్లు



అరకులోయలో దీక్ష చేపట్టిన గ్రామ వలంటీర్లు



ముంచంగిపుట్టులో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్న వలంటీర్లు



చింతూరులో వలంటీర్ల నిరాహార దీక్షలను ప్రారంభిస్తున్న సీఐటీయూ నాయకులు

పాడేరు : తమను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, బకాయి పడిన ఏడు నెలల వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ గ్రామ వలంటీర్లు స్థానిక ఐటీడీఏ ఎదుట గురువారం రిలే దీక్షలు చేపట్టారు. వీటిని గ్రామ వలంటీర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు రూ.10 వేల గౌరవ వేతనంతో విధుల్లోకి తీసుకుంటామని కూటమి నేతలు హామీ ఇచ్చారన్నారు. అధికారం చేపట్టి ఏడు నెలలైనా విధుల్లోకి తీసుకోకపోవడం నమ్మించి మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో నిస్వార్థంగా సేవలు అందించిన వలంటీర్లను రాజకీయాల్లోకి తీసుకురావద్దన్నారు. రాజకీయ కక్షలతో వలంటీర్ల కుటుంబాలను రోడ్డు మీదకు తేవద్దని హితవు పలికారు. గత ప్రభుత్వంలో పనిచేసిన 2.50 లక్షల మంది గ్రామ వలంటీర్లంతా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అనుకుంటే ఆ పార్టీ ఎందుకు ఓటమి పాలవుతుందని ప్రశ్నించారు. రిలే దీక్షలు ఈనెల 28 వరకు కొనసాగుతాయన్నారు. ఆ తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటించి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్. సుందరరావు, గ్రామ వలంటీర్ల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, కొండబాబు, మండల నాయకులు సురేష్ కుమార్, సత్యారావు, వాసు, సింహాచలం, రమణ, మంజు, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

చింతూరు: వలంటీరు వ్యవస్థపై ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాల్లో చర్చించి స్పష్టమైన ప్రకటన చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. చింతూరు డివిజన్లోని నాలుగు మండలాల్లోని వలంటీర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఐటీడీఏ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో మూడు రోజుల రిలే నిరాహార దీక్షలను గురువారం వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంపచోడవరం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకట్, వలంటీర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు పొడియం జానీ, గిరిజన సంఘం జిల్లా నాయకుడు సీసం సురేష్, ఎర్రంశెట్టి శ్రీనివాసరావు, పొడియం లక్ష్మణ్, మహేష్, ప్రసాద్, పద్మావతి, శాంతి, కుమార్ పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు పోరాటం : సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ముంచంగిపుట్టు: గ్రామ వలంటీర్లకు కూటమి ప్రభుత్వం న్యాయం చేసే వరకు పోరాటం ఆగదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో వలంటీర్ల దీక్షలు ప్రారంభించారు. ప్లకార్డులతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. భారీ ర్యాలీ నిర్వహించి, న్యాయం చేయాలని కోరుతూ స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి శంకరరావు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎంఎం.శ్రీను, వలంటీర్ల సంఘం మండల అధ్యక్షులు దేవా, సీఐటీయూ నేతలు, వలంటీర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇలావుండగా వలంటీర్ల ఆందోళనకు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జగబంధు, మండల అధ్యక్షులు పద్మారావు, నేతలు దీక్షల్లో మద్దతు తెలిపారు. తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

అరకులోయలో..

అరకులోయ టౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ వలంటీర్లు దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి జన్ని భగత్ రామ్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రజలకు సేవలందించిన గ్రామ వలంటీర్లను తొలగించడం అన్యాయమన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారం వారికి ఉద్యోగ భద్రత కల్పించి, రూ.10 వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు.వలంటీర్ వ్యవస్థను రాజకీయ కోణంలో చూడకుండా వారికి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, ఆనందరావు, సీఐటీయూ ప్రతినిధులు, వలంటీర్లు జాన్‌బాబు, బుచ్చన్న, రాజబాబు, అరుణ, జయరామ్, రాము, కృష్ణ, వెంకటరావు, ధర్మ, మాణిక్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

విశాఖతో మన్మోహన్‌కు అనుబంధం



స్టీల్‌ప్లాంట్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మన్మోహన్ సింగ్ (ఫైల్)

సాక్షి, విశాఖపట్నం : మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌తో గతంలో పలుమార్లు విశాఖలో పర్యటించారు. 2006 మే 20న స్టీల్ ప్లాంట్ విస్తరణ పనులకే ఆయనే శంకుస్థాపన చేశారు. 2008 జనవరి 2వ తేదీన తూర్పు నౌకాదళాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఐఎన్ఎస్ జలశ్వా యుద్ధనౌకలో పర్యటించారు. అనంతరం జలశ్వాలో విధులు నిర్వర్తిస్తున్న వారితో ఆన్ బోర్డుపై మన్మోహన్ కాసేపు ముచ్చటించారు. 2009 జూలై 26న సతీసమేతంగా విశాఖలో పర్యటించారు. ఆ సమయంలో భారత నౌకాదళంలో కీలకమైన జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిహంత్‌ని జాతికి అంకితం చేశారు. ఆయా సందర్భాల్లో ఆయనకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి స్వాగతం పలికారు.

వాల్తేర్ డీఆర్ఎంగా లలిత్ బోహ్రా

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్‌గా లలిత్ బోహ్రా నియమితులయ్యారు. ఈ మేరకు రైల్వే బోర్డు నుంచి ఈస్ట్ కోస్ట్ రైల్వేకు ఉత్తర్వులు చేరాయి. ఇప్పటివరకు ఆయన న్యూ అండ్ రెన్యూవబుల్ ఎనర్జీ మంత్రిత్వ శాఖలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. వాల్తేర్ డీఆర్ఎంగా పనిచేసిన సౌరబ్‌ప్రసాద్ సీబీఐ కేసుల్లో ఇరుక్కున్నారు. అప్పటి నుంచి వాల్తేర్ ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ డీఆర్ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రమేష్

చింతూరు: మండల కేంద్రంలోని ఓ దుకాణం వద్ద గురువారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ఎస్ఐ పేరూరి రమేష్ తెలిపారు. మృతుడు గత కొంతకాలంగా చింతూరు పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తుండేవాడని, కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందినట్టు తెలిపారు. వీఆర్‌వో ఇచ్చిన సమాచారం మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, అతని వివరాలు ఎవరికైనా తెలిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని ఎస్ఐ తెలిపారు.



హరిదాసుకు కానుకలు వేస్తున్న భక్తులు



ఆలయ ప్రాంగణంలో అమ్మ దర్శనానికి వేచి వున్న భక్తులు

సిరులతల్లికి నీరాజనం

- వైభవంగా సహస్ర ఘటాభిషేకం
- 20 వేల మంది భక్తులకు మహాన్నదానం
- 28న కనకమహాలక్ష్మి రథయాత్ర



సహస్ర ఘటాభిషేకంలో ఈవో శోభారాణి

డాబాగార్డెన్స్: సిరులతల్లి కనకమహాలక్ష్మి అమ్మవారు కొలువుదీరిన బురుజుపేట భక్తులతో కిక్కిరిసిపోయింది. మార్గశిర మాసం నాలుగో గురువారం సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. మేలుకొలుపు అనంతరం అమ్మవారిని పసుపు నీళ్లు, పంచామృతాలతో అభిషేకించి పసుపు పూశారు. స్వర్ణాభరణాలతో అలంకరించారు. అర్ధరాత్రి 12.05 నుంచి 1.30 వరకు ఈ అలంకరణతోనే భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం వెండి కవచాలు తొడిగారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు మహానివేదన(రాజభోగం), 12 నుంచి 3 వరకు సర్వదర్శనం కల్పించి, అనంతరం దర్శనాలు నిలిపివేశారు. సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సహస్రఘటాభిషేకం వైభవంగా జరిపారు. రాత్రి 7 నుంచి అమ్మవారి దర్శనాలు పునరుద్ధరించారు. తొలిపూజలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

28న రథయాత్ర

ఈ నెల 28న కనకమహాలక్ష్మి రథయాత్ర నిర్వహించనున్నారు. సాయంత్రం 4 నుంచి జగదాంబ జంక్షన్, మహారాణిపేటలోని అమ్మవారి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయం నుంచి రథయాత్ర ప్రారంభించనున్నారు. జగదాంబ జంక్షన్, టర్నర్ చౌల్ట్రీ, పూర్ణామార్కెట్, రీడింగ్‌రూమ్ మీదుగా అమ్మవారి ఆలయం వరకు యాత్ర సాగనుంది.

మహాన్నదానం

టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

కిటకిటలాడిన క్యూలైన్లు

క్యూలైన్లు ఆలయం నుంచి రీడింగ్ రూమ్ మీదుగా టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయానికి చేరుకున్నాయి. భక్తుల తాకిడి అత్యధికంగా ఉండటంతో క్యూలైన్లలో ఉన్నవారికి మజ్జిగ, వాటర్ ప్యాకెట్లను దేవస్థానం అందించింది. ఎక్కడికక్కడ మంచినీటి సదుపాయం కల్పించారు. స్వచ్ఛంద సంస్థలు ఉచిత ప్రసాదం అందించాయి.



అమ్మవారికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ కిరణ్మయి, కుటుంబ సభ్యులు, జిల్లా పరిషత్ చైర్మన్ జె.సుభద్ర, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌తో పాటు పలువురు ప్రముఖులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం వీరిచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందించారు. భక్తుల సౌకర్యార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు పాతనగరానికి చెందిన సంఘ సేవకుడు ఎం.వీరభద్రరావు మజ్జిగ ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు.



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నేటి కార్యక్రమాలు

ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం 5 నుంచి 6 వరకు పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ఉదయం 6 నుంచి 11 వరకు సర్వదర్శనం, 11.30 నుంచి మధ్యాహ్నం 12 వరకు పంచామృతాభిషేకం, 12 నుంచి సాయంత్రం 5.30 వరకు సర్వదర్శనం, సాయంత్రం 6 నుంచి రాత్రి 7 వరకు విశేష పంచామృతాభిషేకం, అష్టోత్తరనామార్చన నిర్వహిస్తారు.

'వరి రైతులు ఆందోళన చెందొద్దు'



దూసరపాము వద్ద రహదారిపై ధాన్యం రాశులను పరిశీలిస్తున్న సివిల్ సప్లైస్ డీఎం గణేశ్‌కుమార్



మిల్లుల నుంచి వచ్చిన పాడైన గన్నీ బ్యాగులను డీఎం గణేష్‌కుమార్‌కు చూపిస్తున్న సిబ్బంది

సివిల్ సప్లైస్ డీఎం గణేష్‌కుమార్

సాక్షి ఎఫెక్ట్..

రాజవొమ్మంగి: తుపాను కారణంగా పండించిన వరి పంటలో (ధాన్యంలో) కొంచెం నెమ్ము చేరిందని, అయినా తేమ శాతంలో సడలింపు ఇచ్చి కొనుగోలు చేస్తామని సివిల్ సప్లైస్ డీఎం గణేశ్‌కుమార్ అన్నారు. తేమ శాతం ఖచ్చితంగా 17 ఉండాలని లేదన్నారు. కంగారు పడి ప్రయివేటు వ్యాపారుల వద్ద పంటను అమ్ముకోవద్దని రైతులను కోరారు. ' ప్రయివేటు వ్యాపారులే' దిక్కు అనే శీర్షికన 'సాక్షి'లో గురువారం ప్రచురితమైన కథనానికి డివిజన్, జిల్లాస్థాయి అధికారులు స్పందించారు. డీఎం గణేశ్‌కుమార్ గురువారం సాయంకాలం మండలంలోని దూసరపాము, రాజవొమ్మంగిలలో జాతీయ రహదారిపై ఆరబెట్టుకొన్న ధాన్యం రాశులను పరిశీలించారు. ప్రతి గింజ కొనుగోలు చేస్తామని రైతులకు ధైర్యం చెప్పారు. తుఫాను పరిస్థితుల కారణంగా ప్రస్తుతం కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని డ్రయర్స్ ఉన్న మిల్లులకు తరలిస్తున్నామన్నారు. మిల్లర్స్‌తో మాట్లాడి తేమ కాస్త అటు ఇటుగా ఉన్న ధర తగ్గించవద్దని కోరామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 38 కేంద్రాల ద్వారా 11,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు వివరించారు. జిల్లాలో ఈ ఏడాది 25వేల టన్నుల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. గతేడాది 22,800 టన్నులు కొనుగోలు జరిగినట్టు తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సొమ్మును రెండు రోజుల్లోనే చెల్లిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు రూ.28.37 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు జరగ్గా, రూ. 18.37కోట్ల మేర చెల్లింపులు జరిగాయన్నారు. రాజవొమ్మంగి మండలంలో ఇంతవరకు రూ. 4.45 కోట్ల మేర రైతుల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ చేశామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణ, వీఆర్వోలు, వీఏఓలున్నారు.

రహదారి నిర్మించాలని డిమాండ్



రాళ్లు తేలిన అధ్వాన రహదారిని చూపుతున్న గిరిజన సంఘం నాయకులు

దుంబ్రిగుడ: మండలంలోని సాగర పంచాయతీ గద్యగుడ గ్రామంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు టి.సూర్యనారాయణ పర్యటించి గ్రామంలో సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రధాన రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగర పంచాయతీ పరిధిలో గల గద్యగుడ, పొద్దగుడ గ్రామాల్లో సరైన రహదారులు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యపై స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామస్తులు కేమ్‌దాస్, గోవింద్, గోపాలరావు, రాము తదితరులు పాల్గొన్నారు.

సీలేరు: జి.కె.వీధి మండలం దారకొండ పంచాయతీలోని ములసలవీధి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యపై కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెబుతున్నారు. పలుమార్లు విన్నవించినా నేటి వరకు ఎటువంటి స్పందన లేదన్నారు. ప్రభుత్వాలు ,అధికారులు మారినా తమకు మాత్రం రహదారి కష్టాలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులు, గర్భిణులను డోలిమోతల్లో ఆస్పత్రి తరలించే పరిస్థితి నెలకొందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ములసలవీధి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని గ్రామస్తులు హెచ్చరించారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

రాజవొమ్మంగి: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు రాజవొమ్మంగి రెవెన్యూ ఆఫీసర్ చెల్లమ్మ అన్నారు. మండలంలోని సుబ్బంపాడు, ఎర్రంపాడు గ్రామాల్లో ఆమె ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామస్తులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదస్సులో మ్యుటేషన్లు, ఈ పాస్‌బుక్స్ కోసం భూ యజమానుల నుంచి అర్జీలు స్వీకరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆందోళన



బూసుపల్లిలో తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆదివాసీ మహిళలు

జి.మాడుగుల: మండలంలో వంజరి పంచాయతీ బూసుపల్లి గ్రామంలో రెండోవీధిలో తీవ్ర మంచి నీటి ఎద్దడి ఎదుర్కొంటున్నారు. గతంలో ఈ గ్రామంలో మొదటివీధి గల ప్రజలకు తాగునీటి కోసం కుళాయిలు ఏర్పాటు చేసి తాగునీటి సదుపాయం కల్పించారని గ్రామస్తులు పాంగి లక్ష్మణరావు, కిల్లో కాంతమ్మ తెలిపారు. బూసుపల్లి గ్రామంలో రెండోవీధిలోని తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ మహిళలు గురువారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బూసుపల్లి మొదటి వీధిలో గల ఇళ్లకు ఇంటింటి కుళాయి ద్వారా తాగునీటి సదుపాయం కల్పించి, రెండోవీధిలో బావి నిర్మాణం చేపట్టారని దీని వలన పూర్తి స్థాయిలో ప్రజలకు తాగునీరు అందడం లేదన్నారు. బావి వేసవి కాలంలో ఎండిపోయి నీరుండడం లేదని దీంతో తాగునీటి సమస్య తలెత్తుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో 35ఇళ్లు, సుమారు 150 మంది ఆదివాసీ గిరిజనుల ఉన్నారని, ప్రజావసరాలకు తగ్గట్టుగా తాగునీటి వసతి లేదన్నారు. బూసుపల్లి గ్రామం రెండోవీధి ప్రజలకు వేసవికాలంలో తీవ్ర నీటి సమస్య, వర్షాకాలంలో బావి నుంచి బురదనీటి సమస్యలు తలెత్తుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి బూసుపల్లి రెండోవీధిలో తాగునీటి సమస్యపై దృష్టి సారించాలని వారు కోరారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



నడిమివలసలో మాట్లాడుతున్న నేత సింహాచలం



మునసల గ్రామంలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ



చింతపల్లిలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

దుంబ్రిగుడ: మండంలోని అరమ పంచాయతీ నడిమివలస గ్రామంలో సీపీఐ 100వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కార్యదర్శి కె. సింహాచలం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తరఫున ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. జిల్లా శాఖ కార్యదర్శి కొర్ర దేవరాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: అంతాడ పంచాయతీ మునసలలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, మండల కార్యదర్శి ఇరువాడ దేముడు మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. నేతలు సత్యనారాయణ, లక్ష్మి, నానాజీ, ధారమల్లేశ్, సూరిబాబు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

చింతపల్లి: గిరిజనులకు అండగా సీపీఐ ఎల్లప్పుడూ పోరాటం సాగిస్తుందని పార్టీ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు అన్నారు. చింతపల్లిలో గురువారం పాత బస్టాండ్ ఆవరణలో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజనులు పక్షాన పోరాటాలు చేసి వేలాది ఎకరాలు భూమిని అడవి బిడ్డలకు తమ పార్టీ అప్పగించిందన్నారు.

నేటికి ఎన్నో సమస్యలపై అలుపెరగని పోరాటాలు సాగిస్తోందన్నారు. అంజలి శనివారం సర్పంచ్ పేట్ల రాజుబాబు, ఎర్రబొమ్మలు ఎంపీటీసీ సభ్యుడు సెగ్గె సత్తిబాబు, చింతపల్లి మాజీ వైస్ సర్పంచ్ గంజారి రమణ , నాయకులు చిన్నారావు, అప్పలనాయుడు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వంగవీటి మోహనరంగాకు నివాళి



రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్ తదితరులు

చింతూరు: వంగవీటి మోహనరంగా వర్ధంతి సందర్భంగా చింతూరులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు జమాల్‌ఖాన్, సింగంశెట్టి దుర్గారావులు మాట్లాడుతూ రంగా చేసిన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. విష్ణు, శేషునాయుడు, భాస్కరరావు, శ్రీను, బాబ్జి, శేఖర్, ప్రకాష్ పాల్గొన్నారు.

బడిబయట తిరుగుతున్న విద్యార్థులను టీచర్లకు అప్పగింత

రాజవొమ్మంగి: స్థానిక ఏకలవ్య పాఠశాలలకు చెందిన నలుగురు విద్యార్థులు మండల కేంద్రంలోని మార్కెట్‌లో గురువారం అనుమానాస్పదంగా తిరుగుతుండగా స్థానికులు వారిని గుర్తించి ఉపాధ్యాయులకు అప్పగించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణారావు విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు తప్పిపోవడంపై తీవ్ర ఆందోళన చెందామన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో తమ పిల్లలకు రక్షణ కరువైందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశువులు పాఠశాల గదుల్లో ప్రవేశించి పాడు చేస్తున్నాయని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

జెన్‌కో డ్రైవర్లను ఆదుకోవాలి

సీలేరు: సీలేరు కాంప్లెక్స్ పరిధి ఏపీ జెన్‌కోలో వివిధ విభాగాల్లో విధులు చేపడుతున్న డ్రైవర్లను 487 జీవో ప్రకారం జీతాలతో పాటు ఇతర బెనిఫిట్స్‌ను జెన్కో కాంట్రాక్టర్ ద్వారా అందజేసేలా తగు చర్యలు చేపట్టాలని స్థానిక సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు ఎస్.కె. సుభాన్, ఎంపీ రమణలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీ జెన్‌కో పరిధి సీలేరు కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న డ్రైవర్లకు జీతంతో పాటు ఇతర బెనిఫిట్స్, కూడా అందజేయాలన్నారు. కాంట్రాక్ట్ లేబర్‌తో పాటు డ్రైవర్లకు కూడా సమానపనికి సమాన వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. లక్ష్మణరావు, విష్ణుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

చోడవరం: మార్గశిర మాసం గురువారం చోడవరం శ్రీ లక్ష్మమ్మ అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి కనకమహాలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాదిగా భక్తులు తరలిరావడంతో ప్రత్యేక క్యూలైన్ల ఏర్పాటు చేసి అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నున్న గోపాలం ఆధ్వర్యంలో కమిటీసభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు, క్షీరాభిషేకాలు చేశారు.

అవుట్ సోర్సింగ్ టీచర్ల సమస్యలు పట్టని ప్రభుత్వం



రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చిస్తున్న ఉద్యోగ ప్రజ సంఘాల నాయకులు,



పాడేరు కేంద్రంగా కొన్న సాగుతున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన దీక్ష

- రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిల పక్షం నేతలు ధ్వజం
- ఇప్పటికైనా పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

పాడేరు రూరల్: గిరిజన సంక్షేమ గురుకులం పాఠశాల,కళాశాల్లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు పరిష్కారంపై కూటమి ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందని అఖిల పక్షం నేతలు శేషాద్రి, కేబీ పడాల్, శ్రీనివాస్ పడాల్, రామారావు దొర ధ్వజమెత్తారు. గురువారం వారు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై గిరిజన ఉద్యోగుల భవనం వద్ద ఆదివాసీ ఉద్యోగ, విద్యార్థి, ప్రజాసంఘాలతో ఏర్పడిన అఖిలపక్షం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ పాడేరు జిల్లా కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్షలు 41వ రోజుకు చేరినప్పటికీ ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వ నిరంకుశ పాలనతో గిరిజన విద్యార్థుల విద్యా ప్రమాణాలు మరింత అధ్వానంగా మారా యని విమర్శించారు. ఇప్పటికైనా వారి ప్రధాన డిమాండ్లను పరిష్కరించకుంటే ఉద్యోగ, విద్యార్థి, ప్రజా సంఘాలు ఏకమై ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే ఉద్యమ కార్యాచరణను ప్రకటిస్తామని వారు పేర్కొన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

నల్లక్వారీ మడుగులో మునిగి బాలుడి మృతి



మడుగులో అర్జున్ మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు

పెందుర్తి: పాఠశాలలకు సెలవు కావడంతో సరదాగా స్నేహితులతో ఈతకు వెళ్లిన ఓ బాలుడు నీటిలో మునిగి మృతి చెందాడు. పెందుర్తి సమీపంలోని నల్లక్వారీ మడుగులో జరిగిన ఈ విషాద ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చినముషిడివాడ సమీపంలోని హుద్‌హుద్ కాలనీలో నివాసం ఉంటున్న ధీరజ్ ప్రధాన్ దంపతులకు నలుగురు సంతానం. పదేళ్ల క్రితం నేపాల్ నుంచి బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చిన ధీరజ్ కార్పెంటర్‌గా పనులు చేస్తుంటాడు. అతని రెండో కుమారుడు అర్జున్ ప్రధాన్(12) చినముషిడివాడలోని పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. బుధవారం క్రిస్మస్ సెలవు కావడంతో మధ్యాహ్నం స్నేహితులతో కలిసి బయటకు వెళ్లాడు. ఆ తర్వాత తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వకుండా వారితో కలిసి సమీపంలోని నల్లక్వారీ మడుగులో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయిన అర్జున్ మృతి చెందాడు.

తప్పిపోయాడని ఫిర్యాదు : ఇంటి నుంచి బయటకు వెళ్లిన అర్జున్ ఎంతకీ తిరిగి రాకపోవడంతో బుధవారం రాత్రి పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో తండ్రి ధీరజ్ ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం నల్లక్వారీ మడుగులో బాలుడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడి వెళ్లిన సీఐ సతీష్‌కుమార్, ఎస్ఐ అసిరితాత మృతదేహాన్ని బయటకు తీయించారు. అనంతరం మృతదేహం గుర్తింపు కోసం ధీరజ్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. విగతజీవిగా పడి ఉన్న అర్జున్‌ను చూసి కుటుంబ సభ్యులు గుండెలు విసేలా రోధించారు. పోస్టుమార్టం నిమిత్తం బాలుడి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

FLAT FOR SALE
■ 27 Lakhs Madhurama Enclave Ready to Occupy, Carpark, Lift, Padmavathi Nagar 6th Lane, VIZIANAGARAM. Ph: 92466 24248 [SCA24000955]

Services

GOLD LOANS
■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12678]

Wanted
■ ఉద్యోగ అవకాశం కోసం ఎదురు చూస్తున్నారా మా MNC కంపెనీలో వర్క్ ఫ్రం హోం స్త్రీ పురుషులు కావలెను. Qul:10th-డిగ్రీ జీతం 20k-25k ఉచిత రూము భోజన సదుపాయం. 9110256233, 9036607717 [G-9122]
■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 15,000 నుండి 20,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256020]

■ సెక్యూరిటీ గార్డులు కావలెను (లేడీస్ / జెంట్స్) టెంపరరీగా 20 రోజులు పనిచేయుటకు. గోపాలపట్నం ఏరియాలో రోజుకు రూ॥ 500/- సంప్ర॥ 99666 82926/ 81795 52684 [V- 3331]
■ Merchant Navy Required for Seamen, Oiler, Cook, Steward, Qualification : 10th, 12th, ITI, Diploma, B.Tech, Contact : 90522 20749, 94409 39760 [V- 12265]
■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటి వద్దనే వుంటూ ఒక గంట పార్ట్ టైం మాన్యువల్ వర్క్ చేయుటకు స్త్రీ / పు కావలెను. వీక్లీ పేమెంట్స్ వివరాలకు మీ పేరు వాట్సప్ చేయండి. 7702473949 [G-9121]
■ రియల్ ఎస్టేట్ Co.Hyd, కోకాపేట్, శంకరపల్లి లో విల్లాస్/ప్లాట్స్ సేల్స్‌కై మార్కెటింగ్ Exe. జీ+ కమీషన్+ 2 వీలర్+రూం+భో ఫ్రీ, Age: 30, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. Ph: 7416396781 [HA-16494]
■ మర్చంట్ నేవీలో, Cruiseshipsలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కంపెనీ ఖాళీలు, విభాగం అన్ని డిపార్ట్‌మెంట్స్ వ:18-27, Qly: 10th, ఆబోవ్ లాయిడ్స్ మ్యారిన్ సర్వీసెస్ Pvt. Ltd, Hyd, T.G. కోయంబత్తూర్ (TN). Ph: 7675982065 [SCA24000953]
■ ప్రముఖ ఎయిర్‌లైన్ డొమెస్టిక్ ఇంటర్‌నేషనల్ సర్వీసెస్‌లో వర్క్ చేయుటకు గ్రౌండ్ స్టాఫ్, టిక్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, టీం లీడర్స్, కార్గోలోడర్స్ కావలెను. స్త్రీ/పు శా: 23k-28k Q:10th, డిగ్రీ, ITI, డిప్లొమా, వ: 18-35లోపే. 8187039562 [G-1915]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.
అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030
విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం